సాక్షి నిజామాబాద్

ఆదివారం । 3 । మార్చి । 2024



మరో అవిశ్వాసం?

నల్లవెల్లి సొసైటీ చైర్మన్ సాంబారి మోహన్‌పై అవిశ్వాసానికి డైరెక్టర్లు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

- 8లో ▸



అలలపై బతుకు విన్యాసం

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో చేపల వేటకు వెళ్లి నెల వ్యవధిలో ముగ్గురు మత్స్యకారులు మృతి చెందారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.2 /24.5

వాతావరణం

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. క్రమంగా ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి నిర్మలంగా ఉంటుంది.



ఆర్మూర్ రోడ్డులో అమ్మకానికి ఉన్న రాజస్థాన్ రంజన్లు

మట్టికుండ.. సల్లగుండ..

మట్టికుండలో నీళ్లు తాగితే చల్లదనానికి చల్లదనం.. ఆరోగ్యానికి ఆరోగ్యం.. అందుకే ఎన్ని అధునాతన ఫ్రిజ్‌లు వచ్చినా రంజన్లకు డిమాండ్ తగ్గడంలేదు. వేసవి రాకముందే జిల్లాలో ఎండలు ముదరడంతో అప్పుడే గిరాకీ పెరిగింది. కుండలతో పాటు వాటర్ బాటిళ్ల కొనుగోలుపైనా నగరవాసులు ఆసక్తి చూపిస్తున్నారు. రాజస్థాన్ నుంచి తెచ్చి నగరంలోని పలుచోట్ల విక్రయిస్తున్నారు. వివిధ ఆకృతుల్లో రంజన్లు, బాటిళ్లు ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో రంజన్ రూ. 200 నుంచి రూ. 500వరకు, మట్టి వాటర్ బాటిళ్లు రూ. 100 నుంచి రూ. 300 వరకు అమ్ముతున్నారు. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్



మట్టి వాటర్ బాటిళ్లు





రంగులతో రంజన్లు

న్యూస్‌రీల్

సుగంధ ద్రవ్యాల మార్కెటింగ్‌పై అవగాహన



రుద్రూర్: రుద్రూర్ ఫుడ్ సైన్స్ టెక్నాలజీ కళాశాలలో శనివారం మేరా యువ భారత్ కార్యక్రమంలో భాగంగా స్పైసెస్ బోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు సుగంధ ద్రవ్య పంటలు–మార్కెటింగ్‌పై అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ ద్వారా గుజరాత్‌కు చెందిన అసిస్టెంట్ రీసెర్చ్ సైంటిస్ట్ డాక్టర్ స్వామినాథన్ డిజిటల్ మార్కెటింగ్ టెక్నిక్స్ వివరించారు. వ్యవసాయ పరిశోధన కేంద్రం అధిపతి బాలాజీ నాయక్, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త రాజ్‌కుమార్, మినిస్ట్రీ ఆఫ్ ఫుడ్ ప్రాసెసింగ్ డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ యశ్వంత్ కుమార్, జిల్లా స్పైసెస్ బోర్డ్ డిప్యూటీ డైరెక్టర్ సుందరేషన్, కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు గ్రూప్–1 ఉచిత కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాలని బీసీ స్టడీ సర్కిల్ కోఆర్డినేటర్ వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7వ తేదిలోపు సుభాష్‌నగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులను అందించాలన్నారు. విద్యార్హత, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డ్ జిరాక్స్ దరఖాస్తుకు జత చేయాలని సూచించారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావుకు నివాళి



సుభాష్‌నగర్: శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి శనివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో స్పీకర్‌గా శ్రీపాదరావు అందించిన సేవలను స్మరిస్తూ ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ట్రెయినీ ఐపీఎస్ చైతన్య రెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ముత్తెన్న పాల్గొన్నారు.

అయోధ్యకు మలి విడత రైలు ప్రారంభం



సుభాష్‌నగర్: అయోధ్యలో బాలరాముడి దర్శనంతో జన్మ ధన్యం అవుతుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అన్నారు. ఇందూరు నుంచి అయోధ్యకు వెళ్లే రెండో విడత ఆస్థా ప్రత్యేక రైలును బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారితో కలిసి ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం నగరంలోని రైల్వేస్టేషన్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ రైలులో నిజామాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 1500 మంది భక్తులు రాముడిని దర్శించుకునేందుకు వెళ్లారన్నారు. భక్తులకు భోజనం, టీ, స్నాక్స్, ఇతర అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, పంచరెడ్డి ప్రవళిక, ఎర్రం సుధీర్, పవన్, హరీష్‌రెడ్డి, పవన్ ముందాడ, కిరణ్ పాల్గొన్నారు.

నలుగురిపై సస్పెన్షన్ వేటు

సదాశివనగర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నలుగురిని విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం తెలిపారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ ప్రతాప్‌కిరణ్, డిపార్ట్‌మెంటల్ అధికారి రాజాగౌడ్‌తోపాటు మాల్‌ప్రాక్టీస్‌ను ప్రోత్సహించిన హిందీ లెక్చరర్ ఇస్రత్, కెమిస్ట్రీ లెక్చరర్ రంజిత్‌కుమార్‌లను సస్పెండ్ చేశామని పేర్కొన్నారు. ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మాస్‌కాపీయింగ్‌కు అవకాశం ఇవ్వకుండా పరీక్షలను నిర్వహించాలని లేకపోతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్వింద్‌కే మళ్లీ చాన్స్

- నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా ఖరారు
- ప్రకటించిన పార్టీ జాతీయ నాయకత్వం
- బీజేపీ శ్రేణుల సంబురాలు..

సుభాష్‌నగర్: నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్ ధర్మపురికే అవకాశం దక్కింది. పార్టీ జాతీయ నాయకత్వం శుక్రవారం మొదటి జాబితాలో ఆయన పేరును ప్రకటించింది. ఈ పార్లమెంట్ అభ్యర్థిత్వం కోసం చాలా మంది ఆశావహులు ఎవరికి వారు ప్రయత్నాలు చేసినప్పటికీ.. అధినాయకత్వం అర్వింద్ వైపు మొగ్గు చూపింది. అర్వింద్‌ను అభ్యర్థిగా ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేశారు.

పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండతోపాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, జగిత్యాల్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గంపై మరోసారి కాషాయ జెండా ఎగరేయాలని భావిస్తున్న అధినాయకత్వం గెలుపు అవకాశాలు అధికంగా ఉన్న అర్వింద్‌కు మరోసారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. గత అసెంబ్లీ ఎన్నికల నాటి కంటే ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి ఓట్లశాతం భారీగా పెరిగింది. ఉత్తర తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ పార్టీల మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ ఉండనుంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కంటే బీజేపీకి సుమారు 43 వేల ఓట్లు మాత్రమే తక్కువగా వచ్చాయి.


నిజామాబాద్ పార్లమెంట్ స్థానంపై మరోసారి కాషాయ జెండా ఎగరేయాలని భావిస్తున్న బీజేపీ అధిష్ఠానం గెలుపు అవకాశాలు ఉన్న అర్వింద్‌కే మరోసారి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. పార్లమెంట్ పరిధిలోని రెండు అసెంబ్లీ స్థానాలు కైవసం చేసుకోవడం, బలమైన కేడర్‌తో పాటు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించడం బీజేపీకి అనుకూలమైన అంశాలుగా భావిస్తున్నారు.

అర్వింద్ గెలుపు ఓ చరిత్ర..

2019 పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్న అర్వింద్.. ఏకంగా ముఖ్యమంత్రి కుమార్తె, సిట్టింగ్ ఎంపీ కల్వకుంట్ల కవితపై 75 వేల పైచిలుకు మెజార్టీతో విజయం సాధించి చరిత్ర సృష్టించారు.

ఎన్నికల సమయంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తానని బాండ్ పేపర్ రాసిచ్చి కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టారు. గత ఎన్నికల్లో పసుపుబోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో 165 మందికిపైగా రైతులు 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 185 మంది అభ్యర్థులు పోటీచేసిన విషయం తెలిసిందే.

పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డీఎస్ తనయుడిగా పరిచయమైన అర్వింద్ ధర్మపురి 2017 సెప్టెంబర్ 17న అప్పటి కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సమక్షంలో బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. 2018 మార్చిలో చెరుకు రైతుల చర్నాకోల్ పేరుతో జగిత్యాల జిల్లా ముత్యంపేట్ నుంచి బోధన్ నిజాం షుగర్స్ ఫ్యాక్టరీ వరకు పాదయాత్ర చేశారు.



బీజేపీకి అనుకూలించే అంశాలు..

- గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పసుపు బోర్డును ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ మహబూబ్‌నగర్ బహిరంగ సభలో ప్రకటించారు.
- 500 ఏళ్ల హిందువుల కల అయోధ్యలో రామమందిర నిర్మాణం.
- కార్యకర్తలకు అర్వింద్ ధర్మపురి ఫౌండేషన్ నుంచి ఆర్థికసాయం.
- రైల్వేఓవర్ బ్రిడ్జిల నిర్మాణం..
- కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, బలమైన కేడర్ పార్టీకి ఉంది.
- పార్లమెంట్ పరిధిలోని నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ అసెంబ్లీ స్థానాలు కైవసం.
- గల్ఫ్ కార్మికుల కుటుంబాల అండ.
- పసుపు ఎగుమతులు పెంచడం, తద్వారా ధర క్వింటాలుకు రూ.15 వేలు పలకడం, తదితర అంశాలు బీజేపీ అభ్యర్థికి అనుకూలిస్తాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

బయోడేటా..

తల్లిదండ్రులు : విజయలక్ష్మి, ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్), రాజ్యసభ మాజీ సభ్యులు, మాజీ మంత్రి, ఉమ్మడి ఏపీ కాంగ్రెస్ అధ్యక్షులుగా పనిచేశారు.
భార్య : ధర్మపురి ప్రియాంక,
కుమారులు : రుద్రాక్ష్, సమన్యు
పుట్టిన తేదీ : ఆగస్ట్ 25, 1976
జన్మస్థలం : వేల్పూర్ గ్రామం
జిల్లా : నిజామాబాద్
విద్యాభ్యాసం : ఎంఏ (పొలిటికల్ సైన్స్)
కులం : మున్నూరుకాపు (బీసీ)
మతం : హిందు
రాజకీయ పదవులు : 2019లో మొదటిసారి పోటీ చేసి ఎంపీగా విజయం.
చిరునామా : నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని ఆర్మూర్‌లో నివాసం. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎంపీ కార్యాలయం.
ఇంటి అడ్రస్ : 164 ఏ, ఎమ్మెల్యే కాలనీ, రోడ్‌నెంబర్ : 12, బంజారా హిల్స్, హైదరాబాద్–500033,
ఫోన్‌నెంబర్ : 91009–24777, 98488–99999,
అదనపు యాక్టివిటీస్ : క్రికెట్ ప్లేయర్.

సంబురాలు

సుభాష్‌నగర్: బీజేపీ ఎంపీ అభ్యర్థిగా అర్వింద్‌ను ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచి పెట్టి, పటాకులు కాల్చారు. ధన్‌పాల్ మాట్లాడుతూ అర్వింద్‌ను గతంలో కంటే ఎక్కువ మెజార్టీతో గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నిజామాబాద్ అర్బన్‌లో లక్ష ఓట్లు పక్కాగా సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి, కార్పొరేటర్లు, నాయకులు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, బుస్సాపూర్ శంకర్, ఆకుల శ్రీనివాస్, మెట్టు విజయ్, ఇప్పకాయల కిషోర్, పంచరెడ్డి శ్రీధర్, రోషన్, ప్రభాకర్, సాయిరాం, తదితరులు పాల్గొన్నారు.



స్వీట్లు తినిపించుకుంటున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేశ్

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు..

సెగ్మెంట్	కాంగ్రెస్	బీఆర్ఎస్	బీజేపీ
నిజామాబాద్అర్బన్	59,853	44,828	75,240
నిజామాబాద్‌రూరల్	78,378	56,415	49,723
ఆర్మూర్	42,989	39,395	72,658
బాల్కొండ	65,884	70,417	30,250
బోధన్	66,963	63,901	33,555
కోరుట్ల	39,647	72,115	61,810
జగత్యాల	54,421	70,243	42,138
మొత్తం	4,08,135	4,17,314	3,65,374



ఇలా వచ్చి అలా టికెట్టు కొట్టి..

సాక్షి, కామారెడ్డి/నిజాంసాగర్: రెండ్రోజుల క్రితమే బీఆర్ఎస్‌ను వీడి బీజేపీ తీర్థం పుచ్చుకున్న బీబీ పాటిల్‌కు జహీరాబాద్ పార్లమెంట్ టికెట్టును పార్టీ అధిష్టానం కేటాయించింది. డోంగ్లీ మండలం సిర్పూర్ గ్రామవాసి, లింగాయత్ సామాజిక వర్గానికి చెందిన బీబీ పాటిల్ 2014 సంవత్సరంలో బీఆర్ఎస్‌లో చేరి రాజకీయ ఆరంగ్రేటం చేశారు. అదే సంవత్సరంలో జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో జహీరాబాద్ స్థానం నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌షెట్కార్‌ను ఓడించి తొలిసారి ఎంపీగా ఎన్నికయ్యారు. 2019 సంవత్సరంలో బీఆర్ఎస్ నుంచి రెండోసారి పోటీ చేసిన ఆయన.. కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును ఓడించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

- డీఎంహెచ్‌వో సుదర్శనం

నిజామాబాద్‌నాగారం: పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీఎంహెచ్‌వో సుదర్శనం కోరారు. శనివారం ఉదయం పాత కలెక్టరేట్ ఆవరణలో పల్స్ పోలియో ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. ఐదేళ్లలోపు చిన్నారులు అందరికీ చుక్కల మందు వేయించాలన్నారు. ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారన్నారు. దీని కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ వైద్య శాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పోలియో చుక్కల బూతులు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో సిబ్బంది ఉంటారన్నారు. జిల్లాలో 1,91,0 81మంది ఐదేళ్లలోపు చిన్నారులు ఉంటారని వీరికి చుక్కల మందు వేయడానికి 1,007 బూత్‌లు, 37 మొబైల్ బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆదివారం పోలియో చుక్కలు వేయించుకొని వారికి సిబ్బంది ఇంటింటికి తిరిగి సోమ, మంగళవారాల్లో వేస్తారని తెలిపారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి అశోక్ మాట్లాడుతూ వందశాతం చిన్నారులకు పోలియో చుక్కలు వేయించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో అంజన, డాక్టర్ తుకారాంరాథోడ్, బి గంగాధర్, వెంకటేశ్వర్లు, స్వామి సులోచన, భూమన్న, ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సబిత తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో సుదర్శనం

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

సుభాష్‌నగర్: పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్‌తో కలిసి సహాయ రిటర్నింగ్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఏవైనా అనుచిత ఘటనలు చోటుచేసుకున్న వాటిని, అసాధారణ రీతిలో ఓటింగ్ నమోదైన వాటిని సమస్యాత్మక జాబితాలో చేర్చాలన్నారు. ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. వారం రోజుల్లో సహాయ రిటర్నింగ్ అధికారుల స్థాయిలోనూ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి విధులు, బాధ్యతలపై తర్ఫీదు ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల వద్ద తనిఖీ కేంద్రాలను నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాలకు కూడా శిక్షణ తరగతులు ఏర్పాటుచేసి, సి విజిల్ యాప్, ఈఎస్ఎంఎస్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకునేలా సూచించాలని ఆదేశించారు. ఎన్నికల సంఘానికి గడువులోపు నివేదికలను ఈఎస్ఎంఎస్ యాప్ ద్వారా పంపాల్సి ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, ఏసీపీలు రాజా వెంకట్‌రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

తల్లిదండ్రులపై ప్రేమతో..

బాల్కొండ: ముప్కాల్ మండలం వేంపల్లిలో తల్లిదండ్రుల విగ్రహాలను తనయులు ప్రతిష్ఠించారు. గ్రామానికి చెందిన జక్క గంగారాం (మాజీ సర్పంచ్), జక్క లసుంబాయి దంపతులకు ముగ్గురు కుమారులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ముగ్గురు కుమారులు పోశెట్టి, రాజేశ్వర్, గంగాధర్‌లు కలిసి తల్లిందండ్రులపై ఉన్న మమకారంతో వారి విగ్రహాలను శనివారం తమ వ్యవసాయ క్షేత్రం వద్ద ప్రతిష్ఠించారు. బాల్కొండ మండలం వన్నెల్(బి) గ్రామానికి చెందిన శివ రామ కృష్ణ తపోవనం పీఠాధిపతి విరాజనందస్వామీ చేతుల మీదుగా విగ్రహాలను ఆవిష్కరించారు.



తల్లిదండ్రుల విగ్రహాల వద్ద కుమారులు, కుటుంబ సభ్యులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఖలీల్‌వాడి: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రౌడీషీటర్లను పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ హెచ్చరించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం రౌడీ షీటర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ.. కమిషనరేటు పరిధిలో 326 మంది రౌడీ షీటర్లు ఉన్నారని తెలిపారు. రౌడీ షీటర్లపై నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రెయినీ ఐపీఎస్ చైతన్యరెడ్డి, ఏసీపీలు రాజావెంకట్ రెడ్డి, బస్వారెడ్డి, శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీ కల్మేశ్వర్

క్లుప్తంగా

గుడిసెల తొలగింపు



సాక్షి ఎఫెక్ట్‌..

బాల్కొండ: మండల కేంద్రంలోని సర్వే నంబరు 1333 ప్రభుత్వ భూమలో రాత్రికిరాత్రి గుడిసెలు వెలిసిన వైనంపై గత నెల 26వ తేదీన 'గుడిసె వెలిసె' శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితం కాగా, అధికారులు స్పందించారు. రెవెన్యూ సిబ్బంది గుడిసెలను తొలగించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్‌ శ్రీధర్‌ హెచ్చరించారు. సర్వే నంబర్‌ 1333లో 224.19 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అధికారులు సర్వే నిర్వహిస్తున్నారు.

427మంది గైర్హాజరు

నిజామాబాద్‌అర్బన్‌: ఇంటర్‌ రెండో సంవత్సరం ఇంగ్లిష్‌ పరీక్షకు శనివారం 427 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 97 శాతం విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌ తెలిపారు. మొత్తం 57 సెంటర్లకుగాను జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ, స్క్వాడ్లు 46 కేంద్రాలను తనిఖీ చేశారు. ఇంటర్‌ విద్యాధికారి రఘురాజ్‌ బోధన్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాల, మధుమలంచ జూనియర్‌ కళాశాల సెంటర్లతోపాటు మరో ఆరు ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలు తనిఖీ చేశారు.

ఇంటర్‌ వాల్యూయేషన్‌ క్యాంప్‌ అధికారిగా రవికుమార్‌

ఇంటర్మీడియెట్‌ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం అధికారిగా రవికుమార్‌ను ఇంటర్మీడియట్‌ బోర్డు నియమించింది. ప్రస్తుతం ఆయన పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు.

నేటి నుంచి పీజీ తరగతులు

నిజామాబాద్‌అర్బన్‌: ఈనెల 3 నుంచి డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ పీజీ మొదటి సంవత్సరం తరగతులు నిర్వహిస్తున్నట్లు కో ఆర్డినేటర్‌ రంజిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. మిగతా వివరాలకు 73829 29612 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రేషన్‌షాపులకు ముక్కిన బియ్యం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న రేషన్‌ బియ్యంలో ముక్కినవి రావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. బియ్యం జాలీలు కట్టి నల్లగా వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాసిరకం బియ్యాన్ని లబ్ధిదారులకు ఎలా పంపిణీ చేయాలో అర్థం కావడం లేదని రేషన్‌ డీలర్లు వాపోతున్నారు. మండలంలోని అన్నిరేషన్‌ షాపుల్లో నాలుగు నుంచి ఐదుసంచులు ఇదే రకం బియ్యం రావడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారు. అధికారులు స్పందించి నల్లగా వచ్చిన ముక్కిన బియ్యం సంచులను వాపసు తీసుకొని మంచి బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు.

అలలపై బతుకు విన్యాసం..

మత్స్యకారుల జీవనం విలక్షణం

- చేపల వేటే వీరి జీవనాధారం
- వేట సాగితేనే ఉపాధి
- సౌకర్యాలు కల్పించాలంటున్న మత్స్యకారులు
- నెల రోజుల వ్యవధిలో ముగ్గురి మృతి
- పట్టించుకోని ప్రభుత్వం



ఎస్సారెస్పీలో చేపలు పడుతున్న మత్స్యకారుడు



మృతిచెందిన మత్స్యకారుడు రమేశ్‌ (ఫైల్‌)

బాల్కొండ: సాగరంలో వేటే జీవనంగా సాగుతున్న మత్స్యకారుల జీవనశైలి అంతా విభిన్నం. ఇల్లు వదిలి ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి.. తిరిగొచ్చే వరకు అనుక్షణం ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ నిత్యం ఆటుపోట్ల మధ్య సాగే వీరి జీవనం ఓ సమరం. మత్స్యకారుల దినచర్య అర్ధరాత్రి నుంచే ఆరంభమవుతుంది. వీరు సాగించే జీవన తెరను ఒక్కసారి తెరిస్తే ఆసక్తికరమైన విషయాలు వెలుగు చూస్తాయి. వీరు వినియోగించే వల నుంచి సాగించే వేట వరకూ అన్నీ విభిన్నం..

థర్మకోల్‌ షీట్లపైనే ప్రయాణం..

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టులో నిజామాబాద్‌, నిర్మల్‌ నుంచి అనేక మంది మత్స్యకారులు చేపల వేట కొనసాగిస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరు ముందుగా చేపల వేటకు బయలు దేరేముందు థర్మకోల్‌ షీట్లతో ఏర్పాటు చేసుకున్న తెప్పలను నీటిపై ఉంచుతారు. నీటిలోకి దిగాక తెప్పలపై కూర్చుని ఏర్పాటు చేసుకున్న వలను ముందు భాగంలో ఉంచుకుంటారు. నీటి మధ్యభాగంలోకి వెళ్లాక వలను విసురుతారు. తెప్ప సైజు తక్కువగా ఉండటం, వాటిపైన వలలు ఉంచడంతో ప్రమాదవశాత్తు నీటిలోని వల మత్సకారుల కాళ్లకు చుట్టుకోవడంతో నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోతున్నారు.

పట్టించుకోని ప్రభుత్వం

ప్రకృతి విసిరే సవాళ్లను ఎదుర్కొంటూ నిత్యం ఆటుపోట్ల మధ్య సాగే మత్స్యకారుల జీవితాన్ని ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. థర్మకోల్‌ షీట్లపై ప్రయాణం ప్రాణాల మీదికి వస్తోందని, మరబోట్లు, సేఫ్టీజాకెట్లు అందించాలని మత్స్యకారులు ప్రభుత్వాలను కోరినా పట్టించుకోవడం లేదు. ఫలితంగా మత్స్యకారులు ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమదబీమా ఉన్నా వాటికి అనేక కొర్రీలు ఉంటాయని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నీటితో సహవాసం చేస్తూ..

చేపల వేట సాగితేనే 'ఉపాధి' అన్నట్లుగా మత్స్యకారుల జీవితం తయారవుతోంది. వీరిలో కొందరికి చేపల వేట కొనసాగించినా చేపలు చిక్కక పోవడంతో ఖాళీ చేతులతో ఇంటికి వెళ్లిన రోజులు సైతం ఉన్నాయి. ఉపాధి భారమవుతున్నా నీటి తో సహవాసం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. మత్స్యకారులు. ఇకనైనా ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

నెలరోజుల్లో ముగ్గురు మృతి

ప్రాజెక్టులో చేపలు పట్టేందుకు వచ్చిన మత్స్యకారులు గత నెల వ్యవధిలో ముగ్గురు మృతి చెందారు. నీట మునిగి మృతి చెందిన వారి ఆచూకీ మూడు రోజుల వరకు లభించడం లేదు. ఇటీవల ముప్కాల్‌కు చెందిన రమేశ్‌ ప్రాజెక్ట్‌లో మునిగి మృతి చెందగా మృతదేహం మూడు రోజులకు లభ్యమైంది. ఇప్పటికైన అధికారులు స్పందించి తాము ప్రమాదాలు బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మరబోట్లను సరఫరా చేయాలి



ప్రభుత్వం మత్స్యకారులకు మరబోట్లను సరపరా చేయాలి. లైఫ్‌ జాకెట్లను అందించాలి. తరచూగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వలలు కాళ్లకు చుట్టుకోవడంతోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఫలితంగా వారు పైకి రాలేని పరిస్థితి నెలకొంటోంది. ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలి. – సాగర్‌, మత్స్యకారుడు

కాశీ మోక్షయాత్ర ట్రస్ట్‌కు వైకుంఠరథం

- మంచాల ట్రస్ట్‌ ఆధ్వర్యంలో వితరణ
- రథాన్ని ప్రారంభించిన హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతీస్వామి



పూజలు చేస్తున్న విద్యారణ్య భారతీస్వామి

నిజామాబాద్‌ సిటీ: వారణాసిలోని కాశీ మోక్షయాత్ర ట్రస్ట్‌కు మంచాల శంకరయ్య చారిటబుల్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని అందజేశారు. నగరంలోని న్యాల్‌కల్‌ చౌరస్తాలో రథానికి హంపీ పీఠాధిపతి విద్యారణ్యభారతీస్వామి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్ట్‌ చైర్మన్‌ మంచాల జ్ఞానేందర్‌ మాట్లాడుతూ.. కాశీకి చెందిన కొందరు నిజామాబాద్‌కు వచ్చినప్పుడు వైకుంఠ రథాలను చూసి ఇటువంటివి కాశీలో సైతం ఏర్పాటు చేయాలని కోరగా, ట్రస్ట్‌ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని ప్రత్యేకంగా తయారు చేయించామన్నారు. కాశీలో రథానికి అయ్యే ఖర్చును మంచాల శంకరయ్య ట్రస్ట్‌ భరిస్తుందని జ్ఞానేందర్‌ తెలిపారు. ఇటువంటి వైకుంఠ రథం ఉత్తరప్రదేశ్‌ రాష్ట్రంలోనే మొదటిదని, దేశ ప్రధాని నరేంద్రమోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్రంలో వైకుంఠరథాన్ని పెట్టడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఒక్క రథం సరిపోనిపక్షంలో మరో మూడు రథాలను అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఇప్పటికి వరకు నిజామాబాద్‌, బోధన్‌, బాన్సువాడ, సిరిసిల్లా, వేములవాడ, కనగర్తి, హైదరాబాద్‌లో వైకుంఠ రథాలు నడుస్తున్నాయని, ఇప్పటివరకు 19వేల అంత్యక్రియలకు రథాలను ఉపయోగించారని, అలాగే ఆత్మలు వదిలిన శరీరాలను భద్రపరిచే ఫ్రీజర్లు 10 ఉన్నాయని జ్ఞానేందర్‌ వివరించారు.

మెడికల్‌ కాలేజీకి డెడ్‌బాడీ అప్పగింత



ముత్తెమ్మ మృతదేహాన్ని మెడికల్‌ కాలేజీకి అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

నిజామాబాద్‌నాగారం: నవీపేట మండలం బినోలకు చెందిన ముత్తెమ్మ శనివారం మృతి చెందగా, ఆమె మృతదేహాన్ని కుటుంబ సభ్యులు మెడికల్‌ కాలేజీకి అప్పగించారు. ముత్తెమ్మకు ఇద్దరు కుమారులు ప్రభుచరణ్‌, దేవదాస్‌, కుమార్తె సుశీల ఉండగా, ఆమె భర్త కమ్యూనిస్టు పార్టీ కార్యకర్త. ప్రభుచరణ్‌ సీపీఐఎంఎల్‌ ప్రజాపంథాలో కొనసాగుతున్నారు. వైద్యవిద్యార్థుల ప్రాక్టికల్స్‌కు తమ తల్లి మృతదేహం ఉపయోగపడేలనే ఉద్దేశంతో ముత్తెమ్మ డెడ్‌బాడీని వారు మెడికళాశాలకు అప్పగించారని ప్రజాపంథా రాష్ట్రకార్యదర్శి వి ప్రభాకర్‌ అన్నారు.

మెడికల్‌ కళాశాల ప్రిన్సిపల్‌ డాక్టర్‌ ఇందిర మాట్లాడుతూ.. వైద్యవిద్యార్థుల ప్రాక్టికల్స్‌ కోసం ఇప్పటి వరకు 18 మంది డెడ్‌బాడీలను అప్పగించారన్నారు. సీపీఐఎంఎల్‌ ప్రజాపంథా నిజామాబాద్‌ డివిజన్‌ కార్యదర్శి ఎం వెంకన్న, బోధన్‌ డివిజన్‌ కార్యదర్శి రాజేశ్వర్‌, నాయకులు కే గంగాధర్‌, సాయిరెడ్డి, డాంగె సాయిలు పాల్గొన్నారు.

మరో అవిశ్వాసానికి రంగం సిద్ధం?

- సుముఖంగా ఉన్న నల్లవెల్లి సొసైటీ డైరెక్టర్లు
- ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌కు పదవీ గండం!
- కీలకంగా వ్యవహరిస్తున్న ప్రజాప్రతినిధి



నల్లవెల్లి సహకార సంఘం



మోహన్‌, ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌

ఇందల్వాయి: ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ సాంబారి మోహన్‌కు పదవీగండం పొంచి ఉందని పలువురు పేర్కొంటున్నారు. నల్లవెల్లి సహకార సొసైటీ చైర్మన్‌గా ఎన్నికై అనూహ్య పరిణామాల మధ్య ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌గా సాంబారి మోహన్‌ ఎన్నికయ్యారు. అయితే, నల్లవెల్లి సొసైటీలోని ఎనిమిది మంది సభ్యులు చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానికి సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడంలో కీలకంగా వ్యవహరిస్తున్న అధికార పార్టీ ప్రజాప్రతినిధిని ఇప్పటికే సిర్నాపల్లి గ్రామానికి చెందిన నలుగురు డైరెక్టర్లతోపాటు నల్లవెల్లికి చెందిన ఇద్దరు కూడా కలిసినట్లు సమాచారం. మరో ఇద్దరు బీజేపీ అనుకూల డైరెక్టర్లను ఒప్పించేందుకు నియోజకవర్గానికి చెందిన ఆ పార్టీ కీలక నాయకుడితో మిగతా డైరెక్టర్లు మాట్లాడుతున్నట్లు సమాచారం. అంతా డైరెక్టర్లు అనుకున్నట్లు జరిగితే.. మరో వారం రోజుల్లో అవిశ్వాస తీర్మనం ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

ముఖ్యమంత్రి చెంతకు..

అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టాలనే డైరెక్టర్ల ఆలోచన వెనుక సూత్రధారిగా ఉన్న ప్రజాప్రతినిధిని ఐడీసీఎంఎస్‌ చైర్మన్‌ కలిసి తాను కాంగ్రెస్‌ పార్టీలో చేరుతానని, అవిశ్వాస తీర్మానాన్ని విరమించుకునేలా చేయాలని కోరినట్లు సమాచారం. అక్కడ ఫలితం లేక పోవడంతో జిల్లా కు చెందిన కీలక నేతల సహకారంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసే యోచనలో ఉన్నట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో 15 చోట్ల అవిశ్వాస తీర్మానాలు

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో ఇప్పటి వరకు 15 చోట్ల అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెట్టినట్లు డీసీవో శ్రీనివాసరావు తెలిపారు. నాలుగు చోట్ల అవిశ్వాస తీర్మానాలు నెగ్గగా, కామారెడ్డిలో ఐదు చోట్ల, నిజామాబాద్‌లో నాలుగు చోట్ల బలనిరూపనకు తేదీలు ఇచ్చామని, మరో రెండు చోట్ల కోర్టు స్టే ఆర్డరు ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

ఒక్కొక్కరికి మూడు ఉద్యోగాలు



సీహెచ్‌ ప్రగతి



శ్రీరాం గీత



సతీశ్‌

మాక్లూర్‌: గురుకుల అధ్యాపక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి ఒక్కొక్కరు మూడు ఉద్యోగాలు సాధించి శభాష్‌ అనిపించుకున్నారు. మాక్లూర్‌ మండల కేంద్రంలోని కేజీబీవీలో ప్రత్యేకాధికారిణిగా కొనసాగుతున్న సీహెచ్‌ ప్రగతి గురుకుల ఫలితాల్లో ప్రతిభకనబర్చి మూడు ఉద్యోగాలకు ఎంపికైంది. ఈమె ప్రస్తుతం తెలంగాణ యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేస్తున్నారు. జువాలజీ సబ్జెక్టులో జూనియర్‌ లెక్చరర్‌గా, బయోసైన్స్‌ పీజీటీ, టీజీటీ పోస్టులకు ఎంపికైంది. జూనియర్‌ లెక్చరర్‌ అత్యుత్తమమైనది కావడంతో ఆ పోస్ట్‌ ని ఎంచుకున్నట్లు ప్రగతి తెలిపారు.

న్యావనందికి చెందిన గీత..

సిరికొండ: మండలంలోని న్యావనందికి చెందిన శ్రీరాం గీత గురుకుల కళాశాల జేఎల్‌గా, పీజీటీగా, టీజీటీగా మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. బీఈడీ, పీజీ పూర్తి చేసిన గీత ప్రైవేట్‌ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా పని చేస్తోంది. ఎంకాం బీఈడీ పూర్తి చేసిన ఆమె భర్త నరేంద్ర ఇక్కడ ఉద్యోగం లభించక పోవడంతో గల్ఫ్‌కు వలస వెళ్లాడు. తన భార్య అయినా ఉద్యోగం సాధించాలని ఆమెను ప్రోత్సహించాడు.

పేపర్‌ బాయ్‌ నుంచి..

వర్ని (మోస్రా): మండలంలోని గోఫూర్‌కు చెందిన పేపర్‌ బాయ్‌ సతీశ్‌ గురుకుల టీజీటీగా ఉద్యోగం సాధించాడు. సతీశ్‌ తన చిన్నతనం నుంచి పేపర్‌బాయ్‌గా పని చేస్తున్నాడు. ఇంటర్‌చదువుతున్న సమయంలో అతడి తండ్రి గంగారాం, ఆ తరువాత ఆరు నెలలకు తల్లి బాలవ్వ మృతి చెందాడు. కామారెడ్డి ప్రభుత్వ కళాశాలలో పీజీ పూర్తి చేసిన సతీశ్‌ యూజీసీ నెట్‌, సెట్‌లను కూడా సాధించాడు.

ఆదాయాభివృద్ధి పనుల పరిశీలన



మాక్లూర్‌: స్వయంసహాయక సంఘాల సభ్యులు తాము పొందుతున్న రుణాల ద్వారా ఆర్థిక వనరులను ఎలా పెంపొందించుకుంటున్నారనే అంశాన్ని ట్రైనీ ఐఏఎస్‌ కిరణ్మయి గ్రామాల్లో పర్యటిస్తూ తెలుసుకుంటున్నారు. ఈ మేరకు శనివారం కృష్ణానగర్‌లో పర్యటించారు. డెయిరీ ఫామ్‌, సోలార్‌ ప్లాంట్‌, తీగరకం కూరగాయలసాగు, ఆర్గానిక్‌ వ్యవసాయసాగును పరిశీలించారు. తాము పొందిన రుణాలతో ఆర్థికాభివృద్ధి సాధిస్తుండడంతో అభినందనీయమని అన్నారు. స్వయం సహాయక సంఘాల ఏర్పాటు ఉద్దేశం ఏమిటని, వాటి నిర్వహకు ఎలాంటి చర్యలు తీసుకుంటారని వీవోఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులను కిరణ్మయి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన లక్‌పతి దీదీ కార్యక్రమానికి కిరణ్మయి ముఖ్యఅతిథిగా హాజరై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్డీవో సాయాగౌడ్‌, డీపీఎం సాయిలు, స్త్రీనిధి ఆర్‌ఎం రాందాస్‌, మాక్లూర్‌ ఎంపీడీవో జె క్రాంతి, ఏపీఎం అనీల్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



కామారెడ్డి రూరల్‌ :జాతీయ ఉపాధిహామీ పథకం కింద జాబ్‌ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించాలని ఎంపీడీవో నాగవర్ధన్‌ సూచించారు. శనివారం మండలంలోని శాబ్దిపూర్‌, గర్గుల్‌, ఇస్రోజీవాడి గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామాల్లో నర్సరీ, గొర్రెల షెడ్డు, పశువుల షెడ్డుకు దరఖాస్తు చేసుకుంటే మంజూరు ఇస్తామన్నారు. ఉపాధి హామీ పనుల్లో లేబర్‌ శాతాన్ని పెంచాలన్నారు. ఆయన వెంట ఎంపీవో మల్హారి ఉన్నారు.

పింఛన్‌ ఆశ చూపి రూ.20వేలు కాజేత

దోమకొండ: నెలకు రూ.25వేల పింఛన్‌ ఇప్పిస్తామని మాయమాటలు చెప్పి ఓ మహిళ నుంచి రూ.25వేలు కాజేసిన ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మి పింఛన్‌ డబ్బులు తీసుకొని ఇంటికి వెళ్తుండగా, బైక్‌పై ఇద్దరు వ్యక్తులు ఎదురు వచ్చారు. లక్ష్మితో మాట్లాడిన వారు.. నీ భర్త దుబాయిలో చనిపోయాడు కాబట్టి నెలకు రూ.25వేల పింఛన్‌ ఇప్పిస్తామని నమ్మబలికారు. గతంలో కూడా తాము మీ ఇంటికి వచ్చామని కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు తెలుపగా ఆమె నమ్మింది. తన వద్ద ఉన్న పింఛన్‌ డబ్బులు రూ.2వేలతోపాటు తన కూతురికి చెందిన రూ.18వేలు మొత్తం రూ.20వేలు వారికి ఇచ్చింది. మాయమాటలతో నమ్మించిన సదరు వ్యక్తులు ఆ తరువాత కనిపించకుండాపోవడంతో తాను మోసపోయానని గ్రహించిన లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఏఎస్సై సుబ్రహ్మణ్యచారిని వివరణ కోరగా, ఫిర్యాదు అందిందని ఆయన తెలిపారు.

గంజాయి పట్టివేత

- ముగ్గురిపై కేసు నమోదు, రిమాండ్‌



ఎక్సైజ్‌ పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు

నిజామాబాద్‌ రూరల్‌(డిచ్‌పల్లి): డిచ్‌పల్లి మండలంలోని దేవుపల్లి సమీపంలో గంజాయి విక్రయిస్తున్న పవన్‌కళ్యాణ్‌ అనే వ్యక్తిని ఆర్మూర్‌ సర్కిల్‌ ఎక్సైజ్‌ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్‌ ఎక్సైజ్‌ సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌ స్టీవెన్‌సన్‌, సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ ప్రమోద్‌ చైతన్య శనివారం రూట్‌వాచ్‌ చేస్తుండగా, దేవుపల్లి సమీపంలో ద్విచక్రవాహనంపై పవన్‌కళ్యాణ్‌ అనుమానాస్పదంగా కనించాడు. వెంటనే అతడిని తనిఖీ చేయగా, అతడి వద్ద 170 గ్రాముల గంజాయి లభించింది. పవన్‌కళ్యాణ్‌ను ఎక్సైజ్‌ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా, తాను నిజామాబాద్‌ నగరంలోని గృహకల్ప కాంప్లెక్స్‌, అసద్‌బాబానగర్‌, నందిగుట్ట ప్రాంతాల్లో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపాడు. సీఐతోపాటు ఎస్సై జిల్లా కేంద్రానికి వెళ్లి ఆయా ప్రాంతాలకు వెళ్లి అనుమానాస్పదంగా తిరుగుతున్న విజయ రాఘవ, రాజును అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా వారి వద్ద 100 గ్రాముల ఎండు గంజాయి లభించింది. గంజాయితో పట్టుబడిన వారిన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్‌ సీఐ, ఎస్సై తెలిపారు. దాడిలో సబ్‌ ఇన్‌స్పెక్టర్‌ చంద్రమౌళి, కానిస్టేబుళ్లు ధర్మేందర్‌, వికాస్‌, సందీప్‌, సాయిబాబా, గొల్ల శ్రీనివాస్‌, నరేశ్‌, మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్‌

వేర్వేరు కారణాలతో నలుగురు మృతి

రెంజల్‌(బోధన్‌): కందకుర్తి పుష్కరఘాట్‌ వద్ద గోదావరిలో శుక్రవారం గల్లంతైన బాలమణి (35) మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ లక్ష్మణ్‌ తెలిపారు. భర్త ఎల్లయ్య ఫిర్యాదు మేరకు స్థానిక జాలర్లతో గోదావరిలో శనివారం గాలించగా, బాలమణి మృతదేహం లభ్యమైందన్నారు. బోధన్‌ మండలం పాండు ఫారం గ్రామానికి చెందిన బాలమణి కుటుంబసభ్యులతో కలిసి గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చింది. బాబ్లీ గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదలడంతో నీటి ప్రవాహనికి కొట్టుకుపోయిందని, బాలమణి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్‌ జిల్లా ఆస్పత్రికి తరలించామని హెడ్‌కానిస్టేబుల్‌ తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

సదాశివనగర్‌(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని షేక్‌ అలీ(46) అనే వ్యక్తి మృతి చెందాడు. కామారెడ్డి పట్టణంలోని బతుకమ్మకుంటకు చెందిన షేక్‌ అలీ కొబ్బరి బొండాల వ్యాపారం చేస్తాడు. ద్విచక్ర వాహనంపై కామారెడ్డి నుంచి గాంధారి వైపునకు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రఫియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చెరువులోపడి ఒకరు..

నిజాంసాగర్‌(జుక్కల్‌): మండలంలోని మల్లూర్‌ గ్రామానికి చెందిన పట్నం సాయిలు (33) ప్రమాదవశాత్తు గ్రామ ఊరచెరువులోపడి మృతి చెందాడు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లిన సాయిలు ప్రమాదవశాత్తు నీటిలోపడి మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సుధాకర్‌ తెలిపారు.

మురికి కాలువలోపడి గుర్తు తెలియని వ్యక్తి..

కామారెడ్డి క్రైం: మురికి కాలువలోపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్‌కాలనీలో శనివారం వెలుగు చూసింది. కాలనీలోని మురికికాలువలో మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో వారు వెంటనే ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్ల ఉంటుందని, మృతదేహం పాక్షికంగా కుళ్లిపోయిందన్నారు. నాలుగు రోజుల క్రితం చనిపోయిఉంటాడని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

మనస్తాపంతో ఆత్మహత్య

నవీపేట : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో మండల కేంద్రానికి చెందిన కొండూరు సాయిలు(33) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు. సాయిలు తన ఇంట్లోని దూలానికి శనివారం ఉదయం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. మృతుడి తల్లి సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దులు మృతి

రెంజల్‌(బోధన్‌): విద్యుత్‌షాక్‌ కారణంగా మండలంలోని తాడ్‌బిలోలి పెద్దవాగులో శుక్రవారం సాయంత్ర ఎద్దుల జత మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నిర్మల్‌ జిల్లా బాసరకు చెందిన వ్యాపారి శనివారం మండలంలోని సాటాపూర్‌ సంతకు ఐదు జతల ఎద్దులను తీసుకుని వస్తున్నాడు. దారిమధ్యలో నీళ్లు తాగేందుకు వాగులోకి దిగిన రెండు ఎద్దులు విద్యుత్‌షాక్‌తో మృతి చెందాయి. బోర్గాం గ్రామానికి చెందిన రైతు వాగులో మీది మోటారు ఏర్పాటు చేసి అక్రమంగా విద్యుత్‌ వినియోగించడంతో వైర్లు తెగి ప్రమాదం జరిగిందని స్థానికులు భావిస్తున్నారు. సదరు రైతు బాధిత వ్యాపారికి రూ.20వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నట్లు స్థానికుల ద్వారా తెలిసింది.

ఇరువర్గాలపై కేసు నమోదు

దోమకొండ: మండల కేంద్రంలో ఇంటి స్థలం విషయంలో గొడవపడి పరస్పరం దాడి చేసుకున్న అన్నాదమ్ముళ్లపై కేసు ననమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన అన్నాదమ్ముళ్లు పన్యాల బాపురెడ్డి, పన్యాల నాగరాజ్‌రెడ్డి, పన్యాల రామ్మోహన్‌రెడ్డి మధ్య ఇంటి స్థలం విషయంలో గొడవ జరిగింది. ఇంటి స్థలం వద్ద తన భాగాన్ని తమ్ముడు రామ్మోహన్‌రెడ్డి కూలగొడుతున్నాడని తెలుసుకొని తన మరో తమ్ముడు నాగరాజ్‌రెడ్డితో కలిసి వెళ్తే తమపై దాడి చేశాడని రామ్మోహన్‌రెడ్డిపై బాపురెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తనపై తన అన్న బాపురెడ్డి, తమ్ముడు నాగరాజ్‌రెడ్డి దాడి చేశారని రామ్మోహన్‌రెడ్డి సైతం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పర్మిట్‌రూమ్‌లో గొడవ చేసిన వ్యక్తిపై..

భిక్కనూరు: మండల కేంద్రంలోని వైన్స్‌ పర్మిట్‌రూమ్‌లో టేబుళ్లు ధ్వంసం చేసిన వేణుగౌడ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ శనివారం తెలిపారు. వేణుగౌడ్‌తోపాటు మరో వ్యక్తి తాగిన మైకంలో పర్మిట్‌ రూమ్‌లోకి వచ్చి గొడవ చేశారు. వైన్స్‌ నిర్వాహకుడు శ్రీనివాస్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'స్లాట్‌' కోసం పడిగాపులు



మీ సేవ ఎదుట శుక్రవారం రాత్రి భోజనం చేస్తున్న బీరయ్య, భాగవ్వ

రామారెడ్డి: చిత్రంలో కనిపిస్తున్న భార్యాభర్తలు బీరయ్య, భాగవ్వ కామారెడ్డి జిల్లా రామారెడ్డి మండలం గొల్లపల్లికి చెందిన వారు. దివ్యాంగులైన వీరు సదరం స్లాట్‌ బుక్‌ చేసుకోవడానికి రామారెడ్డి మీ సేవ కేంద్రానికి మరో పదిమంది గ్రామస్తులతో కలిసి శుక్రవారం సాయంత్రమే వచ్చారు. వెంట భోజనం, దుప్పట్లు తీసుకొని వచ్చి మీ సేవ ఎదుటే నిద్రించారు. అయితే, ఇంటర్మీడియెట్‌ పరీక్షల కారణంగా శనివారం ఉదయం మీసేవ తెరుచుకోకపోవడం, మధ్యాహ్నం 2గంటల నుంచి సైట్‌ ఓపెన్‌ కావడంతో అప్పటి వరకు అక్కడే పడిగాపులు కాశారు. మధ్యాహ్నం సైట్‌ఓపెన్‌ కాగానే బీరయ్య, భాగవ్వతోపాటు మిగతా దివ్యాంగుల వివరాల నమోదుకే సమయం సరిపోయింది. సైట్‌ బంద్‌ కావడంతో స్లాట్‌ బుక్‌ కాలేదు.

మరోమారు సదరం స్లాట్‌ బుకింగ్‌కోసం ఇచ్చిన తేదీల్లో మీ సేవకు వచ్చి వేలిముద్ర పెడితే స్లాట్‌ బుకింగ్‌ పూర్తమవుతుందని మీ సేవ నిర్వాహకులు చెబుతున్నారు. దివ్యాంగులైన తాము ఒక రోజు ముందే మీసేవకు చేరుకొని రోడ్డుపై తిని అక్కడే నిద్రించినా పని కాలేదని బీరయ్య, భాగవ్వ ఆవేదనకు లోనయ్యారు. అధికారులు స్పందించి స్లాట్‌ బుకింగ్‌ సమయం పెంచాలని వారు కోరారు.